సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఐదో వార్డులో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందపోయినా వెంటనే తెలియజేయాలని తెలిపారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, గత ఎన్నికల్లో ఆయన ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో గ్రామ ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయన్నారు. సమస్య పరిష్కారానికి సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే సమస్య పరిష్కారమవుతోందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని, తనను ఎమ్మెల్యేను చేయాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్.వెంకటమురళీకృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్. వేణుగోపాలనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ సీహెచ్ మురళీకృష్ణ, బుడా చైర్మన్ ప్రతినిధి ఐ. గోపాలరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ టి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి



ఆర్‌డీఓతో మాట్లాడుతున్న యానాది తెగ ప్రజలు

బొబ్బిలి: తమకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ యానాది తెగ(నక్కల వాళ్లుగా పిలవబడుతున్న)కు చెందిన ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై సోమవారం పట్టణంలో ఆర్‌డీఓ శేషశైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలిలో 40 ఏళ్లుగా నివాసముంటున్న తమకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో తమ పిల్లలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జిల్లాలోని సీతానగరం, మక్కువ మండలాల్లో ఉంటున్న తమ తెగకు చెందిన వారికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారని, తమకు కూడా ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు.

పక్కాగా భూముల రీసర్వే



పూనువలస గ్రామంలో భూముల రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: పక్కాగా భూముల రీసర్వే నిర్వహించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆదేశించారు. భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని పూనువలస గ్రామంలో సచివాలయ సర్వేయర్లు చేపడుతున్న గ్రౌండ్ ట్రూతింగ్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. సరిహద్దులు గుర్తించినప్పుడు సంబంధిత భూముల రైతులు దగ్గర ఉండేలా చూసుకోవాలన్నారు. సర్వేలో ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసి, వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

చురుగ్గా జలజీవన్ మిషన్ పనులు



సోమిదవలసలో జరుగుతున్న పైపులైన్ పనులు

తెర్లాం: మండలంలోని పణుకువలస, సోమిదవలస గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. సర్పంచ్ చందక సత్యనారాయణ ఆధ్వర్యంలో రూ.94 లక్షల వ్యయంతో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు సంబంధించి, పైపులైన్లు వేస్తున్నారు. గతంలో తాగునీటి సమస్య ఎదుర్కొన్న ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తుండడం విశేషం. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు చొరవతో ఈ పనులకు నిధులు మంజూరు కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'స్పందన' సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన వీలైనంత తొందరగా ప్రజల వినతులను పరిష్కరించాలని, ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావాలని కోరారు. రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టి, పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటశిబిరంపై దాడులు

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస శివారులోని ఓ తోటలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.41,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు.

ఘనంగా బాలపార్వతమ్మ జాతర

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో బాలపార్వతమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఈ ఏడాది పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని వేడుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



తెర్లాం: అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రాజాం: రామినాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలోని బుచ్చింపేటకు చెందిన కోరాడ రామినాయుడు తండ్రి కోరాడ దాసు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం గ్రామానికి చేరుకుని దాసు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, వంగర మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, వి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బోను అప్పలనాయుడు తల్లి ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం ఆ గ్రామం చేరుకుని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరారు.

ఆక్రమణలో ప్రభుత్వ భూమి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొండలమామిడివలస గ్రామస్తులు

రేగిడి: మండలంలోని కొండలమామిడివలస గ్రామ పరిధిలో ఆక్రమణకు గురవుతున్న 2.86 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించండి అని సర్పంచ్ వియ్యపు చక్రపాణి, గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 1985లో సర్వే నంబర్ 49-1లో 2.86 ఎకరాలను పేదల ఇళ్ల నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం కేటాయించగా, ఇప్పుడు అదే భూమిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమస్య పరిష్కారానికి లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించి, తమ భూమిని తమకు అప్పగించాలని కోరుతుండడం గమనార్హం. వినతిపత్రం అందజేసిన వారిలో పి.రామ్మోహనరావు, సీహెచ్ తిరుపతిరావు, ఎం.వెంకటరమణ, సీహెచ్ వాసు, వి.వెంకటరమణ, సీహెచ్ వెంకటరమణ, పి.రాంబాబు, సీహెచ్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ జి.మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద, సర్పంచ్ కె.గోవిందరావులు మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపాలన్నారు. దీని ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో అధిక ఆదాయం వస్తుందన్నారు. అలాగే నవధాన్యాలు సాగు చేసి, నేలను సారవంతం చేసుకోవాలని సూచించారు. నేల రకానికి తగిన పంటలు వేసుకుంటే పంటలు బాగా పండుతాయన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను పంటలకు వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి.అప్పలనాయుడు, ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ తిరుపతినాయుడు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డిప్యూటీ డీఈఓ ఎస్.తిరుపతినాయుడు సూచించారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన ప్రతీ విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యేలా బోధించాలని తెలిపారు. ప్రతిరోజూ లెస్సన్ ప్లాన్ ఆధారంగా విద్యాబోధన చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు తరచూ పాఠశాలలను పర్యవేక్షించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడుభూముల పట్టాలు

రామభద్రపురం: మండలంలోని అర్హులైన వారందరికీ పోడుభూముల పట్టాలు ఇవ్వాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుబ్బారావుతో సమావేశమైన ఆయన మండలంలోని ఏయే గ్రామాల నుంచి పోడుభూముల పట్టాల కోసం దరఖాస్తులు వచ్చాయి.. సర్వే చేశారా లేదా అనే విషయాలపై ఆరాతీశారు. స్పందించిన తహసీల్దార్ పాతరేగలో 48 మంది అర్హులను గుర్తించామని, పట్టాల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని మిగిలిన గిరిజన గ్రామాల్ల కూడా సర్వే చేసి, అర్హులను గుర్తించాలని ఏవైనా సమస్యలుంటే తనకు తెలియజేస్తే ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రూ.కోటితో కాశీవిశ్వేశ్వరాలయ నిర్మాణం



ప్రారంభానికి సిద్ధమైన కాశీవిశ్వేశ్వరాలయం

రాజాం సిటీ: మండలంలోని మొగిలివలస గ్రామంలో రూ.కోటి వ్యయంతో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయ నిర్మాణం చేపడుతున్నారు. గ్రామస్తులు చందాలు వేసుకుని మరీ ఈ ఆలయ నిర్మాణం చేపడుతుండగా, ప్రస్తుతం ఆలయ పనులు పూర్తి కావచ్చాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఆలయ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి, సూర్యనారాయణమూర్తి, లక్ష్మీగణపతి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నామన్నారు.

సచివాలయ కన్వీనర్లు, గృహసారథులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

● సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు దరిచేర్చడంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులదే కీలక పాత్ర కావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సోమవారం సమావేశమైన ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లాంటి గొప్ప వ్యక్తిని తానెప్పుడూ చూడలేదన్నారు. ఏ ఒక్క పథకంలో అవినీతి జరగకుండా ఉండేందుకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ఆయన జమ చేస్తున్న నగదుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ పార్టీకి ఓటు వేస్తారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామసచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలకు చేరాల్సిన పథకాల లబ్ధిలో సగం దోచుకునేవన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. లోకేష్ యువగళం పేరిట చేస్తున్న పాదయాత్ర టీడీపీ పాడెయాత్ర అని విమర్శించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు బొబ్బిలిలో నా గెలుపుతోనే ఆరంభమవుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ ఫిరాయించి, ఇక్కడి ప్రజల మనోభావాలను బొబ్బిలిరాజులు దెబ్బతీశారని విమర్శించారు. అన్నిచోట్ల పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, జెడ్పీటీసీ శాంతకుమారి, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్. వేణుగోపాలనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ టి.దామోదర్ పాల్గొన్నారు.

30 మద్యంబాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంబాటిళ్లను చూపిస్తున్న ఎస్‌ఈబీ సీఐ జైభీమ్, సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని గున్నతోటవలస గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 30 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ సోమవారం తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా ఫోన్ నంబర్ 9440902372కు సమాచారం ఇవ్వాలని, సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండలంలోని అరసాడ గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల హాజరు, స్పందన వినతులు, వాటి పరిష్కారంను పరిశీలించారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, సచివాలయానికి సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' ట్రయల్ రన్ విజయవంతం



మాట్లాడుతున్న వైద్యాధికారి శిరీష

రామభద్రపురం: ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువచేయాలన్న సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ట్రయల్ రన్ విజయవంతమైందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ చిన్నికృష్ణతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆమె మండలంలోని సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి, వైద్య సేవలందించామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచానపడిన రోగులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. త్వరలోనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించనుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా చాలావరకు మాతాశిశు సంరక్షణకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలోని కంచరాం, రాజయ్యపేట, పొగిరి గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీఓ బాసూరి శంకరరావు సోమవారం పరిశీలించారు. అనంతరం చెత్త సేకరణ, ఎరువుల తయారీపై క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. ఇక్కడ తయారయ్యే సేంద్రియ ఎరువును రాయితీపై రైతులకు అందజేసి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

12న బీపీ మండల్ విగ్రహావిష్కరణ

రాజాం సిటీ: గుంటూరులో ఈ నెల 12వ తేదీన బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘం నాయకులు యాదవ్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మండల్ లాంటి వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమానికి అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

నేత్ర శస్త్రచికిత్సకు 50 మంది పయనం



కంటి ఆపరేషన్లకు బయలుదేరిన వారితో సిబ్బంది

బాడంగి: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు వసంతరావు పర్యవేక్షణలో విశాఖ శంకర్ ఫౌండేషన్‌కు చెందిన ఆప్తాలమిస్ట్ జాక్సన్, ఏఎన్‌ఎం కనకలక్ష్మి రోగుల కళ్లను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. దాదాపు 50 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసి, ప్రత్యేక బస్సులో విశాఖపట్నానికి తరలించామని నిర్వాహకులు వెంకటరమణ తెలిపారు.

జోరుగా 'ఉపాధి' పనులు



వంగర: ఇరువాడలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు

సంతకవిటి: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. సోమవారం కొండగూడేం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిర్దేశించిన కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని తెలిపారు. అలాగే వేతనదారులు కోరిన వెంటనే పనులు కల్పిస్తున్నామన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తెర్లాం: ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం వస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉంచుకోవాలన్నారు.

రేగిడి: పనుల కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు చేసుకోవాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. సోమవారం మండలంలోని బూరాడ, లచ్చారాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన వేతనదారులకు పూర్తిస్థాయిలో గ్రామాల్లోనే పనులు కల్పిస్తామని, సక్రమంగా పనులు చేసుకుంటే రోజుకు రూ.257 వేతనం వస్తుందన్నారు.

వంగర: మండలంలోని ఇరువాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ సామంతుల సంగంనాయుడు సోమవారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవిలో పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్లు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.



సంతకవిటి: వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి